26-10-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - ఇప్పుడు ఘోర అంధకారమయమైన, భయంకరమైన రాత్రి పూర్తి అవుతోంది, మీరు పగలులోకి వెళ్ళాలి, ఇది బ్రహ్మ యొక్క అనంతమైన పగలు మరియు రాత్రి యొక్క కథ"

ప్రశ్న:- క్షణములో జీవన్ముక్తిని ప్రాప్తి చేసుకునేందుకు లేక వజ్రతుల్యమైన జీవితాన్ని తయారుచేసుకునేందుకు ఆధారము ఏమిటి?

జవాబు:- సత్యమైన గీత, ఇది శ్రీమత్ భగవానువాచ. తండ్రి మీకు సమ్ముఖముగా ఏ డైరెక్షన్లు అయితే ఇస్తున్నారో, అదే సత్యమైన గీత, దీని ద్వారా మీకు క్షణములో జీవన్ముక్తి పదవి ప్రాప్తిస్తుంది. మీరు వజ్రతుల్యముగా అవుతారు.

ప్రశ్న:- స్వర్గము యొక్క అపారమైన సుఖము ఏ పురుషార్థము ఆధారముగా లభిస్తుంది?

జవాబు:- ప్రతి రోజు చదివే చదువు మరియు యోగము ద్వారా స్వర్గము యొక్క అపారమైన సుఖము లభిస్తుంది, అందుకే చదువులో ఎప్పుడూ అలసిపోకూడదు. తండ్రి టీచర్ గా అయి చదివిస్తున్నారు కావున మీరు మంచి మార్కులతో పాస్ అయ్యే పురుషార్థాన్ని చేయండి, ఇందులో ఆశీర్వాదాలు లేక కృప యొక్క విషయమేమీ లేదు.

పాట:- ఓ రాత్రి ప్రయాణీకుడా అలసిపోకు... (రాత్ కే రాహీ థక్ మత్ జానా...)

ఓం శాంతి. ఇప్పుడు ఈ పాటను పిల్లలైన మీరు తయారుచేయించలేదు. దీనిని సినిమావారు కూర్చొని తయారుచేయించారు. దీని అర్థాన్ని ఏమీ అర్థం చేసుకోరు. ప్రతి విషయంలోనూ యథార్థమైన అర్థము తెలియని కారణముగా అనర్థమవుతుంది. పాడుతూ ఉంటారు కానీ ఏమీ అర్థం చేసుకోరు. ఇప్పుడు పిల్లలైన మీకు శ్రీమతము లభించింది. ఎవరిది? భగవంతునిది. భగవంతుని గురించే భక్తులకు తెలియకపోతే ఇక ఆ భక్తుల యొక్క సద్గతి ఎలా జరుగగలదు. భక్తుల రక్షకుడు భగవంతుడు. రక్షించమని అడుగుతున్నారు అంటే తప్పకుండా ఏదో దుఃఖము ఉంది. మమ్మల్ని రక్షించండి అని అంటారు. ఎంతగానో పాడుతారు కానీ భగవంతుడు ఎవరు, దేని నుండి రక్షిస్తారు అన్నది కొద్దిగా కూడా తెలియదు. భక్తులకు లేక పిల్లలకు తమ తండ్రి గురించి తెలియని కారణంగా ఎంత దుఃఖితులుగా అయిపోయారు. ఇప్పుడు దీని అర్థాన్ని పిల్లలైన మీరు అర్థం చేసుకుంటారు. ఇప్పుడు ఇది ఘోర అంధకారమయమైన, భయంకరమైన రాత్రి, ఇది అర్ధకల్పం యొక్క రాత్రి. విద్వాంసులు, ఆచార్యులు, పండితులు మొదలైనవారెవ్వరికీ కూడా రాత్రి అని దేనిని అంటారో తెలియదు. ఆ మాటకొస్తే ఈ జంతువులకు కూడా - రాత్రి నిద్రపోయేందుకని, పగలు మెలకువగా ఉండేందుకని తెలుసు. పిచ్చుకలు కూడా రాత్రివేళలో నిద్రపోతాయి, ఉదయం అవ్వగానే ఎగరడం మొదలుపెడతాయి. ఆ పగలు-రాత్రి అయితే సాధారణమైనవే. ఇది బ్రహ్మ యొక్క అనంతమైన రాత్రి మరియు అనంతమైన పగలు. అనంతమైన పగలు సత్య-త్రేతాయుగాలు మరియు అనంతమైన రాత్రి ద్వాపర-కలియుగాలు. సగం-సగం ఉండాలి కదా. పగలు యొక్క ఆయువు 2500 సంవత్సరాలు. ఈ పగలు-రాత్రి గురించైతే ఎవ్వరికీ తెలియదు. ఇప్పుడు పిల్లలైన మీకు తెలుసు - రాత్రి పూర్తవుతుంది అనగా మీ 84 జన్మలు పూర్తవుతాయి అనగా డ్రామా చక్రము పూర్తవుతుంది, మళ్ళీ పగలు ప్రారంభమవుతుంది. రాత్రిని పగలుగా మరియు పగలును రాత్రిగా తయారుచేసేవారు ఎవరు, ఇది కూడా ఎవ్వరికీ తెలియదు. భగవంతుని గురించే తెలియనప్పుడు ఇక ఈ విషయాలన్నింటినీ ఎలా తెలుసుకోగలుగుతారు. మనుష్యులు పూజలు చేస్తారు కానీ - మేము ఎవరికైతే పూజలు చేస్తున్నామో వారు ఎవరు అనేది అర్థం చేసుకోరు. తండ్రి కూర్చొని అర్థం చేయిస్తారు - మొట్టమొదటి ముఖ్యమైన విషయము గీతను ఖండితం చేయడము. శ్రీమత్ భగవద్గీత అని అంటారు. గీతా పతి భగవంతుడు, అంతేకానీ మనిషి కాదు. బ్రహ్మ, విష్ణు, శంకరులను దేవతలు అని అంటారు మరియు సత్యయుగీ మనుష్యులను దైవీ గుణాలు కలవారు అని అంటారు. దైవీ ధర్మస్థులైన శ్రేష్ఠాచారులను దేవతా గుణాలు కలవారు అని అంటారు. భారత్ యొక్క మనుష్యులు శ్రేష్ఠాచారులుగా ఉండేవారు. వారే మళ్ళీ అసురీ గుణాలు కలవారిగా అయ్యారు. ముఖ్యమైన ధర్మశాస్త్రాలు నాలుగు. ఇంకే ఇతర ధర్మశాస్త్రాలూ లేవు. ఒకవేళ ఉన్నా కూడా చాలా చిన్న-చిన్న మఠాలను స్థాపన చేసారు. ఉదాహరణకు సన్యాసుల మఠాలు, బౌద్ధుల మఠాలు ఉన్నాయి. బుద్ధుడు బౌద్ధ ధర్మాన్ని స్థాపన చేసారు. వారు - మాది ఫలానా ధర్మశాస్త్రమని అంటారు. ఇప్పుడు భారతవాసుల ధర్మశాస్త్రము ఒక్కటే. సత్యయుగీ దేవీ-దేవతల ధర్మశాస్త్రము ఒక్కటే, దానినే శ్రీమత్ భగవద్గీత అని అంటారు. గీత తల్లి వంటిది, గీతా రచయిత పరమపిత పరమాత్మ. శ్రీకృష్ణుని ఆత్మ

ఎప్పుడైతే 84 జన్మలను పూర్తి చేస్తారో, అప్పుడు గీతా భగవంతుడు, జ్ఞానసాగరుడైన పరమపిత పరమాత్మ నుండి మళ్ళీ సహజ రాజయోగాన్ని మరియు జ్ఞానాన్ని నేర్చుకొని ఉన్నత పదవిని పొందుతారు. ఇటువంటి ఉన్నతోన్నతమైన ధర్మశాస్త్రాన్ని ఖండితము చేసేసారు, ఈ కారణముగానే భారత్ గవ్వతుల్యముగా అయ్యింది. గీతను ఖండితము చేయడమనేది డ్రామాలో జరిగిన ఏకైక పొరపాటు. ఇప్పుడు తండ్రి ఏదైతే సత్యమైన గీతను వినిపిస్తున్నారో అది వెలువడాలి. సత్యమైన గీతను ప్రభుత్వం వారు ముద్రించాలి. ఇది శ్రీమత్ భగవానువాచ. క్లుప్తంగా మంచి రీతిలో వ్రాయాలి అని పిల్లల కొరకు తండ్రి డైరెక్షన్ ఇస్తారు. సత్యమైన గీత ద్వారా క్షణములో జీవన్ముక్తి లభిస్తుందని మీకు తెలుసు. తండ్రికి చెందినవారిగా అయి తండ్రి నుండి వారసత్వాన్ని తీసుకోవాలి. బీజాన్ని, వృక్షాన్ని మరియు డ్రామా చక్రాన్ని అర్థం చేయించాలి. సత్యయుగము ఆది సత్యము, అది సత్యముగానే ఉంది మరియు సత్యముగానే ఉంటుందని కూడా గానం చేస్తారు. వృక్షము గురించి తెలుసుకోవడం కూడా సహజమే. దీని బీజము పైన ఉన్నారు. ఇది వెరైటీ ధర్మాల వృక్షము. ఇందులో అందరూ వచ్చేస్తారు. మిగిలిన చిన్న-చిన్న కొమ్మలు-రెమ్మలైతే లెక్కలేనన్ని ఉన్నాయి, మఠాలు-మార్గాలు ఎన్నో ఉన్నాయి. భారత్ యొక్క ఆది సనాతన దేవీ-దేవతా ధర్మము ఉంది, దానిని ఎవరు స్థాపన చేసారు? భగవంతుడు. దానిని మనుష్యులెవ్వరూ స్థాపించలేదు. శ్రీకృష్ణుడైతే దైవీ గుణాలు కల మానవుడు, వారు 84 జన్మలను పూర్తి చేసి ఇప్పుడు అంతిమ జన్మలో ఉన్నారు. సూర్యవంశీయులుగా, చంద్రవంశీయులుగా, వైశ్యవంశీయులుగా అవుతూ-అవుతూ కళలు తగ్గిపోతూ ఉంటాయి. సూర్యవంశీ రాజధాని ఏదైతే సత్యయుగములో శ్రేష్ఠాచారిగా ఉండేదో, అది ఇప్పుడు కలియుగములో భ్రష్టాచారిగా ఉంది. ఇప్పుడు మళ్ళీ శ్రేష్ఠాచారిగా తయారవుతోంది. ఉన్నతోన్నతమైన పాత్ర ఎవరిదవుతుంది అన్నది పిల్లలైన మీ బుద్ధిలో ఉంది. ఇప్పుడు మీరు తెలుసుకున్నారు. ముఖ్యమైనది శివాయ నమః, వారి మహిమ ఏదైతే ఉందో దానిని బ్రహ్మ, విష్ణు, శంకరులకు గానం చేయలేరు. ప్రెసిడెంట్ మహిమను ప్రైమ్ మినిస్టర్ కు లేక ఇతరులెవరికైనా ఇస్తారా? ఇవ్వరు. వేర్వేరు టైటిల్స్ ఉన్నాయి కదా. అందరూ ఒకే విధముగా అవ్వలేరు. పిల్లలైన మీకు ఇప్పుడు బుద్ధి లభించింది. క్రైస్టుకు కూడా తమ క్రిస్టియన్ ధర్మాన్ని స్థాపన చేసే పాత్ర లభించిందని మీకు తెలుసు. ఆత్మ ఒక బిందువు. ఆ ఆత్మలో పాత్ర నిండి ఉంది. క్రిస్టియన్ ధర్మాన్ని స్థాపన చేసి మళ్ళీ పునర్జన్మలు తీసుకుంటూ పాలన చేస్తూ సతో-రజో-తమోలలోకి రావాల్సి ఉంటుంది. చివరిలో మొత్తం వృక్షమంతా శిథిలావస్థకు చేరుకోవాల్సిందే. ప్రతి ఒక్కరికీ ఎంతెంత సమయం పాత్ర లభించింది, బుద్ధుడు ఎంత సమయం పాలన చేయాలి - ఇవన్నీ మీకు తెలుసు. భిన్న-భిన్న నామ-రూపాలతో జన్మలు తీసుకుంటూ ఉంటారు.

ఇప్పుడు బాబా మీ బుద్ధిని ఎంత విశాలముగా చేస్తారు. కానీ కొందరైతే శివబాబాను స్మృతి కూడా చేయలేకపోతారు. అనంతమైన తండ్రి అనంతమైన స్వర్గ వారసత్వాన్ని ఇస్తారు. ఇది కూడా మీరు అర్థం చేయించలేకపోతున్నారు. ఆత్మలో అవినాశీ పాత్ర నిశ్చితమై ఉందని, ఒక శరీరాన్ని వదిలి ఇంకొక శరీరాన్ని తీసుకోవాల్సి ఉంటుందని బాబా ఎన్నో సార్లు అర్థం చేయించారు. ఇవి అర్థం చేసుకోవాల్సిన ఎంత గుహ్యమైన విషయాలు. ఎవరైతే స్కూల్లో రోజు చదువుకుంటూ ఉంటారో, వారే అర్థం చేసుకుంటారు. కొందరు నడుస్తూ-నడుస్తూ అలసిపోతారు. నీవే తల్లివి, తండ్రివి, మేము నీ పిల్లలము... అని గానం చేస్తారు కూడా. తండ్రి అంటారు, నేను మీకు స్వర్గం యొక్క అపారమైన సుఖాన్ని ఇచ్చేందుకు పురుషార్థము చేయిస్తున్నాను, మీరు అలసిపోకండి. ఇంత ఉన్నతోన్నతమైన చదువును చదవడం మీరు వదిలేస్తారు. కొందరైతే చదువును వదిలేసి మళ్ళీ వికారాల్లోకి కూడా వెళ్ళిపోతారు. ఇంతకుముందు ఎలా ఉండేవారో అలా అయిపోతారు. నడుస్తూ-నడుస్తూ పడిపోతే మరి ఇంకేమి జరుగుతుంది. అక్కడ వారు సుఖములోనే ఉన్నా కానీ పదవిలోనైతే తేడా ఉంటుంది కదా. ఇక్కడ అందరూ దుఃఖితులుగా ఉన్నారు. అక్కడ రాజులకు, ప్రజలకు అందరికీ సుఖము ఉంటుంది. అయినా కానీ, పదవి అయితే ఉన్నతమైనది తీసుకోవాలి కదా. చదువును వదిలేస్తే - నీవు యోగ్యుడివి కాదు అని తల్లి-తండ్రి అంటారు. తండ్రి నుండి స్వర్గ వారసత్వాన్ని తీసుకుంటూ-తీసుకుంటూ చాలామంది పిల్లలు అలసిపోతారు. నడుస్తూ-నడుస్తూ మాయ దాడి చేయడంతో తిరిగి వెళ్ళిపోతారు. ఏదైతే జమ చేసుకున్నారో అది ఇక పోతుంది. అప్పుడిక ఏమవుతారు? స్వర్గములోకైతే వెళ్తారు కానీ పూర్తిగా సాధారణ ప్రజలుగా అవుతారు. తండ్రి అంటారు, నాకు చెందినవారిగా అయిన తర్వాత అలసిపోయి కూర్చున్నట్లయితే లేక ద్రోహులుగా అయినట్లయితే వెళ్ళి ప్రజలలో చండాలురుగా అవుతారు. అన్నిరకాల వారు కావాలి కదా. స్వర్గాధిపతులుగా అవుతూ-అవుతూ ఒకవేళ చదువును వదిలేస్తే వారి వంటి మహామూర్ఖులు ప్రపంచంలో ఇంకెవ్వరూ ఉండరు. నీవే తల్లివి-తండ్రివి, మేము నీ పిల్లలము, నీ కృపతో స్వర్గపు అపారమైన సుఖము లభిస్తుంది, కృప చూపించండి - అని రాస్తారు కూడా. తండ్రి అంటారు, కృప చూపించే విషయమేమీ లేదు. నేను టీచరును, చదివిస్తాను, మంచి మార్కులతో పాస్ అయ్యేందుకు పురుషార్థము మీరు చేయండి. అంతేకానీ నేను ఏమైనా కూర్చొని అందరినీ ఆశీర్వదిస్తానా. మీరు యోగములో ఉన్నట్లయితే శక్తి లభిస్తూ ఉంటుంది. అందరూ ఏమైనా సింహాసనంపై కూర్చుంటారా. ఒకరి తలపై ఒకరు కూర్చుంటారా

ఏమిటి. ముఖ్యమైన ధర్మాలు నాలుగే, శాస్త్రాలు కూడా నాలుగే. వాటిలో ముఖ్యమైనది గీత. మిగిలినవన్నీ గీతకు పిల్లలు. వారసత్వమైతే తల్లి-తండ్రి నుండే లభిస్తుంది. ఇప్పుడు తండ్రి సమ్ముఖముగా అర్థం చేయిస్తున్నారు. కేవలం గీతను చదవడం ద్వారా రాజులకే రాజులుగా అవుతారా. బాబా అయితే గీతను చదివారు. కానీ దాని వల్ల ఏమీ జరుగదు. ఇవన్నీ భక్తి మార్గపు శాస్త్రాలు. మీరు పురుషార్థం చేసి 16 కళల సంపూర్ణులుగా అవ్వాలి. ఇప్పుడైతే మీలో ఏ కళలు, ఏ గుణాలు లేవు. ఇలా పాడుతారు కూడా - నిర్గుణుడినైన నాలో ఏ గుణాలు లేవు, మీరే దయ చూపించండి, మమ్మల్ని మళ్ళీ 16 కళల సంపూర్ణులుగా తయారుచేయండి, ఒకప్పుడు మేము ఎలాగైతే ఉండేవారమో మళ్ళీ అలా తయారుచేయండి అని. తండ్రి సమ్ముఖముగా వచ్చి అర్థం చేయిస్తున్నారని ఇప్పుడు మీకు తెలుసు. ఒక నిర్గుణ సంస్థను కూడా తయారుచేసారు. నిర్గుణ, నిరాకార పదాలకు అర్థము కూడా తెలియదు. శివునికైతే ఆకారము ఉంది. ఎవరికైతే పేరు ఉందో వారు తప్పకుండా ఉంటారు కదా. ఆత్మ ఎంత సూక్ష్మమైనది, దానికి కూడా పేరు ఉంది. బ్రహ్మ మహాతత్వము, ఎక్కడైతే ఆత్మలు నివసిస్తాయో, దానికి కూడా పేరు ఉంది కదా. నామ-రూపాలకు అతీతముగానైతే ఏ వస్తువూ ఉండదు. భగవంతుడిని నామ-రూపాలకు అతీతుడు అని అంటారు, మళ్ళీ వారిని సర్వవ్యాపి అని అనేస్తారు. ఇది ఎంత పెద్ద పొరపాటు. మనుష్యులు ఎప్పుడైతే ఈ విషయాలను అర్థం చేసుకుంటారో, అప్పుడు నిశ్చయము ఏర్పడుతుంది. బాబా, మేము మిమ్మల్ని తెలుసుకున్నాము. కల్పకల్పమూ మీ నుండి రాజ్యభాగ్యాన్ని తీసుకుంటూ వచ్చాము. ఇటువంటి నిశ్చయము ఉన్నప్పుడే చదువుకోగలుగుతారు. ఇక్కడి నుండి బయటకు వెళ్ళగానే మర్చిపోతారు. అందుకే మొట్టమొదట వ్రాయించాలి - రాజయోగాన్ని నేర్పించేందుకు శివబాబా తప్పకుండా వచ్చారు అని. రాసి కూడా ఇస్తారు, కానీ మళ్ళీ చదవరు. రక్తంతో కూడా రాసి ఇస్తారు. కానీ వారు ఈ రోజు లేరు. మాయ ఎంత శక్తివంతమైనది. తండ్రి ఎంతగా కూర్చొని అర్థం చేయిస్తారు. ఎప్పుడైతే ఇలాంటి ఉత్తరాలను వ్రాస్తారో అప్పుడే మీ విహంగ మార్గపు సేవ జరుగుతుంది. మీ శక్తి సేనలో కూడా నంబరువారుగా ఉన్నారు. చీఫ్ కమాండరు ఉన్నారు, కెప్టెన్ ఉన్నారు, మేజర్లు ఉన్నారు. కొందరు సిపాయిలతో పాటు బరువులు ఎత్తేవారు కూడా ఉన్నారు. మొత్తం సైన్యమంతా ఉంది. బాబా అయితే పురుషార్థము చేయిస్తారు కదా. ప్రతి ఒక్కరి పురుషార్థము ద్వారా అర్థమవుతుంది - వీరు రాజు-రాణిగా అవుతారు లేక మంచి షావుకార ప్రజలలోకి వెళ్తారు, వీరు సాధారణ ప్రజలలోకి వెళ్తారు, వీరు దాస-దాసీలుగా అవుతారు అని. ఇది అర్థం చేసుకోవడం చాలా సహజము. కావున మొదటి ముఖ్యమైన విషయాన్ని తీసుకోవాలి. బాబా మహారథులను ఎంతగా సవాలు చేస్తూ ఉంటారు. కావున విహంగ మార్గపు సేవ కొరకు ఆలోచన నడవాలి. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. చదువులో అలసిపోకూడదు. ఉన్నతోన్నతమైన చదువును రోజు చదవాలి మరియు చదివించాలి.

2. విహంగ మార్గపు సేవ చేయడానికి యుక్తులను రచించాలి. యోగములో ఉంటూ తండ్రి నుండి శక్తి తీసుకోవాలి. కృప లేక ఆశీర్వాదాలను అడగకూడదు.

వరదానము:- వరదానాల యొక్క దివ్య పాలన ద్వారా సహజమైన మరియు శ్రేష్ఠమైన జీవితాన్ని అనుభవం చేసే సదా భాగ్యశాలి భవ

బాప్ దాదా సంగమయుగములో పిల్లలందరినీ మూడు సంబంధాల ద్వారా పాలన చేస్తారు. తండ్రి సంబంధములో వారసత్వం యొక్క స్మృతి ద్వారా పాలన, శిక్షకుని సంబంధములో చదువు యొక్క పాలన మరియు సద్గురువు సంబంధములో వరదానాల అనుభూతి యొక్క పాలన... ఇవి ఒకే సమయములో అందరికీ లభిస్తున్నాయి. ఈ దివ్య పాలన ద్వారానే సహజమైన మరియు శ్రేష్ఠమైన జీవితాన్ని అనుభవం చేస్తూ ఉండండి. శ్రమ మరియు కష్టము అనే పదాలు కూడా సమాప్తమైపోవాలి, అప్పుడే అదృష్టవంతులు అని అంటారు.

స్లోగన్:- తండ్రితో పాటు సర్వాత్మలకు స్నేహీలుగా అవ్వటమే సత్యమైన సద్భావన.